క్లుప్తంగా

స్వామినాథన్‌కు ఘన నివాళి



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో శనివారం జేఏసీ ఆధ్వర్యంలో హరిత విప్లవ పితామహుడు వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు ఘన నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి వారు పూలమాలలు వేసి, ఆయన సేవలను కొనియాడారు. నాయకులు కె.గంగాధర్, సిలిండర్ లింగం, బాలగంగాధర్, దేవన్న, లక్కంపల్లి చిన్నయ్య, మారంపల్లి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం ఉద్యమిద్దాం



మాక్లూర్: దళిత వర్గాలకు రాజ్యాధికారం అందించే దిశలో ముందుకు వెళ్దామని ధర్మ సమాజ్‌పార్టీ ఆర్మూర్ నియోజక వర్గ ఇన్‌చార్జి ప్రేమ్ పిలుపునిచ్చారు. మండలంలోని బొంకన్‌పల్లిలో 'గడపగడపకు ధర్మ సమాజ్‌పార్టీ' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. దళితులు ఏకతాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందని నాయకులు పేర్కొన్నారు. నాయకులు రమేశ్, గంగాధర్, సుమిధర్, విజయ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

షీటీంకు సమాచారం అందించాలి



ఆర్మూర్‌టౌన్: మహిళలతో అసభ్యంగా ప్రవర్తించే, ఈవ్ టీజింగ్ పాల్పడే వారి సమాచారాన్ని షీటీంకు అందించాలని ఎస్సై అంజమ్మ అన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో శనివారం విద్యార్థినులకు సైబర్ నేరాలపై ఆమె అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థినులు, ఉద్యోగినులు, మహిళలు ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే షీటీంకు సమాచారం అందించాలని, పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. షీటీం (87126 59795) లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూఆర్ కోడ్ ద్వారా షీ టీం పోలీసులకు ఫిర్యాదు చేసే విధానాన్ని మహిళలకు వివరించారు. హెడ్ కానిస్టేబుల్ ముత్యంరావు, కానిస్టేబుళ్లు, విష్ణుశ్, సుమతి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తి ఉంటే చేనేతపై శిక్షణ



రుద్రూర్: ఆసక్తి గల వారికి చేనేత వృత్తిపై శిక్షణ ఇప్పించాలని చేనేత సంఘం మహాజన సభలో సభ్యులు తీర్మానించారు. రుద్రూర్‌లో శనివారం చేనేత సహకార సంఘం 71వ మహాజన సభను సంఘ అధ్యక్షుడు మోత్కూరి నారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా అర్ధ సంవత్సరం జమా, ఖర్చులను సభకు సమర్పించి సభ్యుల ఆమోదం తీసుకున్నారు. 2003- 24 అంచనా బడ్జెట్ ఆమోదంపై చర్చించారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించాలని తీర్మానించారు. సంఘ ఉపాధ్యక్షుడు గోనే దత్తాత్రి, డైరెక్టర్లు పోశెట్టి, శంకర్, గణేష్, లక్ష్మి, మాజీ డైరెక్టర్లు పోతన్న, గంగారాం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిపై విమర్శలు సరికాదు



బోధన్‌టౌన్(బోధన్): మాజీ మంత్రి, టీపీసీసీ కోశాధికారి సుదర్శన్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు విమర్శించడం సరికాదని యూత్‌కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తలారి నవీన్, మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు సాజిద్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డి ప్రజల గుండెల్లో ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ఓటమి ఖాయమన్నారు. నాయకులు ఇనాయత్, రిజ్వాన్, కిశోర్, మున్నా, హైమద్, జహీర్ పాల్గొన్నారు.

ముప్కాల్ ఠాణా పరిశీలన



బాల్కొండ: ముప్కాల్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆర్మూర్ ఏసీపీ జగదీష్ చందర్ తనిఖీ చేశారు. ముందుగా ఠాణాలో రికార్డులను పరిశీలించాడు. విధుల్లో ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలని, దేవాలయాలు, ఏటీఎంలు , బ్యాంకులవద్ద ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ఆయన సిబ్బందికి తెలిపారు. గంజాయి, బెల్ట్ షాపులపై నిఘా పెట్టాలన్నారు. ఎస్సై భాస్కరాచారి, సిబ్బంది ఉన్నారు.

తీరనున్న సాగునీటి గోస

- చిట్టాపూర్ ఎత్తిపోతల పథకానికి నేడు శంకుస్థాపన
- 3500 ఎకరాలకు అందనున్న నీరు



బోరు బావుల ఆధారంగా సాగు అవుతున్న పంట

బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్ రైతుల సాగు నీటి గోసా తీరనుంది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ఎత్తిపోయుటకు చిట్టాపూర్ లిఫ్టు నిర్మాణానికి 149 కోట్ల నిధులను మంజూరు చేశారు. పనులకు ఆదివారం శంకుస్థాపన చేపట్టనున్నారు. దీంతో చిట్టాపూర్, శ్రీరాంపూర్, బాల్కొండ మండల కేంద్ర రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ లిఫ్టు ద్వారా 3500 ఎకరాల భూమి సస్య శ్యామలం కాబోతుంది. బాల్కొండ మండలంలో చివరగా చిట్టాపూర్, శ్రీరాంపూర్ గ్రామాలుంటాయి. ఆ గ్రామాల ఆయకట్టుకు గుత్ప ఎత్తిపోతల పథకం నీరు ఫతేపూర్ మీదుగా వస్తుంది. కానీ చివరి ఆయకట్టు కావడంతో ఆయా గ్రామాల ఆయకట్టుకు నీరు అందడమంటే గగనమయ్యేది. చిట్టాపూర్ గ్రామంలో అధికంగా బోరు బావుల ఆధారంగా సాగు చేస్తున్నారు. భూగర్భ జలాలు అంతంత మాత్రంగానే ఉండటంతో బోరు బావులు ఎప్పుడు ఎత్తిపోతాయో అంటూ బిక్కుబిక్కుమంటు రైతులు పంటలను సాగు చేస్తున్నారు. బోరుబావులు తప్ప ఇతర ఆధారం లేక పోవడంతో పూర్తిస్థాయిలో పంటలు సాగు చేయాలంటే రైతులు జంకుతున్నారు. దీంతో ప్రస్తుతం లిఫ్టు పనులు పూర్తయితే సాగుకు డోఖా ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

తిప్పలు తప్పుతాయి..



చిట్టాపూర్ గ్రామంలో సాగు నీటి తిప్పలు తప్పుతాయి. ఎన్నో ఏళ్ల నుంచి సాగునీటి గోసను ఎదుర్కొంటున్నాం. ప్రస్తుతం లిఫ్టు పనులకు శంకుస్థాపన కావడంతో సాగు నీటికి డోఖా లేకుండపోతుంది. మంత్రి ప్రశాంత్‌రెడ్డికి రుణ పడి ఉంటాం.

– గోవర్ధన్, రైతు, చిట్టాపూర్

రెండు పంటలకు సాగునీరు..



లిఫ్టు పనులు పూర్తయితే రెండు పంటలకు నీరు అందుతుంది. ప్రస్తుతం ఎక్కడ నీటి ఆధారం లేక చెరువులు కూడ ఎండిపోయాయి. లిఫ్టు పూర్తయితే తాగు, సాగు నీటికి ఇబ్బంది లేకుండాపోతుంది. ఎన్నో ఏళ్ల కల నెరవేరుతుండటం ఆనందంగా ఉంది.

– లింగన్న, రైతు, చిట్టాపూర్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



ఆర్మూర్‌లో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



నవీపేటలో..

ఆర్మూర్‌టౌన్/బోధన్/నవీపేట/వర్ని/బాల్కొండ/కమ్మర్‌పల్లి/వేల్పూర్/రుద్రూర్: తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు డిమాండ్ చేశారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో వారు చేపట్టిన సమ్మె శనివారం 20వ రోజు కొనసాగింది. ఈసందర్భంగా ఆర్మూర్, వేల్పూర్, రుద్రూర్‌లో అంగన్‌వాడీలు పొర్లు దండాలు పెడుతూ, నిరసన తెలిపారు. బోధన్‌లో సిబ్బంది నల్లరంగు చీరలు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు.

నవీపేటలో అంగన్‌వాడీ సిబ్బంది కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల సమ్మెకు బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ నేతలు మద్దతు తెలిపారు.

కమ్మర్‌పల్లిలోని మండల మహిళా సమాఖ్య భవనం ఎదుట అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, హెల్పర్స్ బైఠాయించారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె చేస్తామని అంగన్‌వాడీ సిబ్బంది పేర్కొన్నారు. కార్మిక సంఘాల నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాల్కొండ మండల కేంద్రంలో..



వేల్పూర్‌లో పొర్లుదండాలతో నిరసన

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించిన సభాపతి



సుంకినిలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

రుద్రూర్: అర్హులందరికీ ఆసరా పింఛన్లు, పక్కా ఇళ్లు, ఇతర సంక్షేమ ఫలాలు అందజేస్తామని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పోతంగల్ మండలం సుంకిని, రుద్రూర్ మండలం రాయకూర్ క్యాంపు, రాణంపల్లి గ్రామాల్లో శనివారం స్పీకర్ పర్యటించి పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. రూ. ఐదు వందల కోట్లతో బాన్సువాడ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన సామాజిక సమస్యలన్నింటికీ నిధులు కేటాయించామన్నారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి, మభ్యపెట్టె వారిని నమ్మవద్దన్నారు. అనంతరం పలువురు లబ్దిదారులకు గృహలక్ష్మి, కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఆర్డీవో రాజాగౌడ్, సర్పంచ్ మాధవరావ్, నిర్మలరమేష్, రోజాలక్ష్మన్, ఎంపీపీలు సునీత శ్రీనివాస్, సుజాతనాగేందర్, జెడ్పీటీసీ నరోజి గంగారాం తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి సహకరించాలి



రుద్రూర్‌లో మాట్లాడుతున్న చైర్మన్ సంజీవరెడ్డి



సాలూరలో మాట్లాడుతున్న చైర్మన్ అల్లె జనార్దన్



నీలాలో మాట్లాడుతున్న చైర్మన్ ఇమ్రాన్

రుద్రూర్/బోధన్/రెంజల్/నవీపేట/వర్ని/కమ్మర్‌పల్లి: సహకార సంఘాల అభివృద్ధికి రైతులు, సంఘ సభ్యులు సహకరించాలని చైర్మన్లు కోరారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాలోని పలు సహకార సంఘాల (సొసైటీలు) ఆధ్వర్యంలో శనివారం సొసైటీ మహాజన సభలు నిర్వహించారు. రుద్రూర్‌లో విండో చైర్మన్ సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘ సీఈవో లక్ష్మణ్ గతేడాది సొసైటీ ఆదాయ, వ్యయాలను వినిపించారు. సభ్యులు ఆమోదం తెలిపారు. సాలూరలో చైర్మన్ అల్లె జనార్దన్ మాట్లాడుతూ.. సొసైటీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సొసైటీ పరిధిలో రైతులకు వెంటనే రుణమాఫీ ఇవ్వాలని కోరుతూ తీర్మానాన్ని ఆమోదించారు. నీలా గ్రామంలో జరిగిన సభలో చైర్మన్ ఇమ్రాన్ బేగ్ మాట్లాడుతూ.. ప్రతీ రైతుకు రుణమాఫీ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వచ్చే సీజన్‌లో పొద్దుతిరుగుడు కొనుగోలు చేయాలని రైతులు తీర్మానించారు. నవీపేటలో జరిగిన సభలో ఫతేనగర్ శివారులోని మాజీ సైనికోద్యోగుల భూములకు పంట రుణాలు ఇవ్వాలని చైర్మన్ న్యాలకంటి అబ్బన్న, సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అసైన్డ్ భూములకు క్రాప్ లోన్లు ఇవ్వాలని చందూరు సహకార సంఘం మహాజనసభలో రైతులు తీర్మానం చేశారు. ప్యారం అశోక్ అధ్యక్షతన సభ నిర్వహించారు. కమ్మర్‌పల్లి సభలో రైతులు మాజీ చైర్మన్, మాజీ కార్యదర్శి నిధుల వినియోగ వ్యవహారంపై ప్రశ్నించారు. డీసీఓ పరిధిలో ఉందని, మాజీ కార్యదర్శి హాజరైతే త్వరగా కొలిక్కి వచ్చే అవకాశం ఉందని చైర్మన్ దేవేందర్ తెలిపారు.



నవీపేటలో మాట్లాడుతున్న చైర్మన్ అబ్బన్న



వర్నిలో మాట్లాడుతున్న చైర్మన్ అశోక్



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న సీఈవో

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



బోధన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బోధన్‌టౌన్(బోధన్): ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆర్ఎంవో వైద్యుడు రహీం పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం వైద్యశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో పారిశుధ్య ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు వ్యాధులు ప్రభలకుండా ముందు జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు.

ఆర్మూర్‌లో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పుర మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ మాట్లాడుతూ.. స్వచ్ఛత కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలని, అక్టోబర్ 2వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

నందిపేట్ మండలంలో..

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని వన్నెల్ కే గ్రామంలో శనివారం నందిపేట పీహెచ్‌సీ వైద్యురాలు సృజన సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నలందలో ప్రొఫెషనల్ డే

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని నలంద ప్రీ స్కూల్‌లో శనివారం ప్రొఫెషనల్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఏ రంగంలో రాణించాలనుకుంటున్నారో ఆ వేషాధారణలో అలరించారు.

ముక్తార్ పాష వర్ధంతి సభ

మాక్లూర్: మండలంలోని ఒడ్డేట్‌పల్లి గ్రామంలో శనివారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ముక్తార్‌పాష వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి, ఆయన పోరాటాలను కొనియదాడారు. నాయకులు దుద్దు గంగాధర్, సతీష్, సాయిలు, కనకయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌కు ఎంపిక


పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లిలోని విజయ్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కవితాదివాకర్ శనివారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆర్మూర్‌లో ఆదివారం నుంచి నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

బాల్కొండ: మెండోరా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి సమీరా రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. క్రీడాకారిణిని ఉపాధ్యాయులు అభినందించారు.

సత్యశోధక్ సమాజ్ కృషిని కొనసాగించాలి

బోధన్: సాంఘిక వివక్ష, కుల పీడనకు వ్యతిరేకంగా సంఘ సంస్కర్త జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ చేసిన కృషి, పోరాటాన్ని కొనసాగించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి రాజేశ్వర్ అన్నారు. సత్యశోధక్ సమాజ్ 150 ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో శనివారం నిర్వహించారు. నాయకులు మల్లేశ్, శంకర్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేటలోగల ఒకటో వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వార్డు సభ్యురాలు మిద్దె స్వరూప, కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం సర్పంచ్ సాయిలుకు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ నిధులు మంజూరుకాగానే సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

నిజాంషుగర్స్‌ను తెరిపించాలి



బోధన్: బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిజాం షుగర్స్‌ను స్వాధీనం చేసుకొని, పునఃప్రారంభించాలని శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపీకిషన్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా ప్రతినిధి మల్లేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఎన్డీఎస్ఎల్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 57వ రోజుకు చేరాయి. దీక్షలకు వారు మద్దతు తెలిపారు. కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఓవైసీ దిష్టిబొమ్మ దహనం



వర్ని: మండల కేంద్రంలో ఎంఐఎం అధినేత ఓవైసీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు శనివారం దహనం చేశారు. కరీంనగర్‌లోని బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్ కార్యాలయంపై ఎంఐఎం నాయకులు, కార్యకర్తల దాడి యత్నానికి నిరసనగా ఓవైసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు శంకర్‌రెడ్డి, మాడిశెట్టి విఠల్, మహేశ్, వెంకటేశం, సాయిభవాని పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థమే ట్యాంక్ నిర్మాణం

వర్ని(చందూర్): గ్రామంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు తాగునీరు సరఫరా చేసేందుకు అనువైన ప్రదేశంలోనే ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నట్లు లక్ష్మాపూర్ సర్పంచ్ సత్యనారాయణ పేర్కొన్నారు. గ్రామపంచాయతీలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దల అనుమతితోనే పంచాయతీ తీర్మానం ప్రకారం ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నామన్నారు.

విద్యార్థుల చేరిక

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపులే పాఠశాలలో ఎంబీసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గుమ్ముల అశోక్‌రెడ్డి శనివారం ముగ్గురు విద్యార్థులను చేర్పించారు. అనంతరం భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి



మాక్లూర్: రాబోయే ఎన్నికల్లో మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. నమస్తే నవనాథపురం కార్యక్రమంలో భాగంగా శనివారం రాంచంద్రాపల్లి గ్రామంలో ఎమ్మెల్యే ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు పర్యాయాలు గెలిపించినందుకు ప్రతిఫలంగా గ్రామాల అభివృద్ధితోపాటు అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు భూమిపూజలు చేశారు. నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మాస్త ప్రభాకర్, ఆకుల రజినీష్, భూషన్, చింత మల్లారెడ్డి, గోపులక్ష్మి, సుక్కి సుధాకర్, మచ్చర్ల రమేష్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలి

వర్ని: రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని తగిలేపల్లిలో శనివారం కృషి విజ్ఞాన కేంద్రం, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో పంట మార్పిడి పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంక్ అధికారులు రవి, గోపాల్, తగిలేపల్లి సర్పంచ్ వెంకన్న, ఉపసర్పంచ్ మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా తీర్మానం



బాల్కొండ: మండల కేంద్రంలోని రజక సంఘ సభ్యులు శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ మేరకు తీర్మాన ప్రతిని శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డికి అందజేశారు. మోచీ సంఘ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

టెంట్‌హౌస్‌ల ఏర్పాటుకు రుణాలు

కమ్మర్‌పల్లి: టెంట్‌హౌస్ ఏర్పాటు చేసుకోవాల నుకునే మహిళా సంఘాల సభ్యులకు న్యూ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద రుణాలు అందిస్తున్నట్లు కమ్మర్‌పల్లి సెర్ప్ ఏపీఎం కుంట గంగాధర్ ఒక ప్రకటన లో తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన మహిళలు స్థాని క ఐకేపీ సిబ్బంది ద్వారా కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆశా వర్కర్ల డిమాండ్లు నెరవేర్చాలి





కోటగిరిలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు.. కమ్మర్‌పల్లిలో..

మాక్లూర్/రుద్రూర్/ఎడపల్లి/కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజక వర్గాల పరిధిలో చేపట్టిన సమ్మె శనివారం 5వ రోజు కొనసాగింది.

ఈసందర్భంగా వారు పలు మండలాలు, గ్రామాల్లో మానవహారాలుగా ఏర్పడి నిరసన తెలిపారు. సమ్మెకు వివిధ పార్టీల నాయకులు, కార్మిక సంఘాల నేతలు మద్దతు తెలిపారు.

ప్రధాని సభను జయప్రదం చేయాలి



బోధన్‌టౌన్(బోధన్): నిజామాబాద్‌లో అక్టోబర్ 3న నిర్వహించనున్న ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని బీజేపీ పార్లమెంట్ ఇన్‌చార్జి వెంకట్‌రమణి, జిల్లా ఇన్‌చార్జి బాల్‌రెడ్డి కోరారు. పట్టణంలోని ఎంపీఆర్ కార్యాలయంలో శనివారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. అనంతరం పట్టణంలోని చెక్కి క్యాంప్‌నకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి ప్రకాష్‌రెడ్డి బీజేపీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఫుక్రే-3 (హిందీ) - 12.30, 7.10, 10.25 జవాన్ (తెలుగు)- 3.45
స్క్రీన్-2 –	స్కంద - 11.00, 2.30, 6.00, 9.30
స్క్రీన్-3 –	పెదకాపు1- 12.40, 7.20, 10.30 స్కంద - 03.50
స్క్రీన్-4 –	చంద్రముఖి2 (తెలుగు)- 11.45, 3.05, 6.25, 9.45